# అభిమానం

మన పిల్లలపట్ల మనకి అభిమానం, వాత్సల్యం ఉండటంలో తప్పేమీలేదు !

కానీ.... ఆ అభిమానంలో నిండా కూరుకుపోయి, బయట వాళ్ళొచ్చి, మన పిల్లల గురించి ఏదైనా చెడు చెప్తే 'అభిమాన' పడి... 'మా పిల్లలు అలాంటి వాళ్ళుకార'ని వెనకేసుకు రావడం.... దురభిమానం !

మన ఫ్రెండ్స్ పట్లో, పిల్లల పట్లో మనం దురభిమానం ప్రదర్శిస్తున్నంత కాలం... మనల్నెవరూ అభిమానించరు !

పోతే...

మనల్ని ఎవరైనా కించపరిచినపుడు... 'అభిమానం, ఆత్మగౌరవం' దెబ్బతిందంటూ గగ్గోలుపెట్టేమనం... ఎదుటివాళ్ళని కించపరిచేలా మాట్లాడకూడదని ఆలోచించక పోవడమే ఆశ్చర్యకరం !

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు... మందలిస్తేనే అభిమానపడి ఆత్మహత్యలకి పాల్పడే వ్యక్తులు ఆవేశపరులే తప్ప అభిమానధనులు కారు!

అలాగని...

మనల్ని పురుగుల్లా తీసిపారేసే మనుషుల పాదాల దగ్గర - వాళ్ళ 'కరుణా కటాక్ష వీక్షణాల'కోసం మన వ్యక్తిత్వాన్ని చంపుకుంటూ పడివుండటం... 'అభిమాన హీన త్వ'మే అవుతుంది!

అభిమానం, స్వాభిమానం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం.... ఏ పేరైతేనేం... అన్నీ 'అహం' దెబ్బతింటే.... బుసకొట్టే నాగులే!

అయితే....

రెండు వైపులా పదునున్న అహాన్ని ఒడుపుగా పట్టుకుని అదుపులో పెట్టుకోగలిగే మనిషే... జీవితంలో ఉన్నత శిఖరాల్ని అధిరోహించగల్గుతాడు!

1-1-1995